కరిఖలం

"శిఖిముఖి"

చతురశ్ర క్షేత్రంలో ప్రతిపక్షుల క్షాత్రం.

సైన్యానికి చుక్కెదురుగా ఒక సైన్యం... చతురంగాలు ... షోడశ వ్యూహాలు... చతుష్షష్టి స్థానాలు. చతుష్టయ గుణితపు, క్షేత్ర గణితపు పరిణామాని (Progression) కది చరమ సోపానం.

శితి, గతివిశేషాలూ సితాసితాలకి సమానధర్మాలుగా శోభిల్లేయి. సామ్యానికంతటితో స్వస్తయింది.

పగ, జిగీషా ప్రతిద్వంద్వులకి ప్రేరణశక్తులయ్యాయి. అంతటితో పోలిక అంతమయింది.

శ్వేతస్కంధావారం సంహతంగా (serried) గా విడిసింది. ఎదిరించి, ఉజ్జీగా వ్యూఢమయిన నల్లబలం నీలోత్పలచయం లాగ నప్పి వుంది.

ఆమే, అతడూ అభిముఖంగా ౬-3 కాపురంలాగ కూర్చున్నారు. పనిచెరుపునీ, పప్పుముద్ద భోజనాన్ని కలిపి పలికించిన డెల్ఫిక్ ఆరెకిల్ (Delphic Oracle) వంటి తెలుగు సామెత ఉపశ్రుతిగా ఉపయోగపడలేదు. ఫలితం కాయా, పండా? అన్న విషయాన్ని చూళికాప్రాయంగానయినా సూచన చెయ్యలేదు.

కదనం కవిసమయాల కిది అదను కాదంది. వైరుల విరోధం అలంకారాల వరకూ వ్యాపించింది. షోడశకళాపూర్ణమయిన శుక్లపక్షం కువలయానందకరం కాలేదు. పరంతప విక్రమార్కుడు పడతి ముఖపద్మానికి ప్రీతిని కనుపరచలేదు.

తమ నెలవులు తప్పక పోయినా మిత్రుడు శత్రువు కావచ్చునని శతకానికి సవరణగా సుమతికి కొత్తసుద్దులు చెప్పాలనుకుంది సుదతి.

కైరవాలు తీర్చిన తమ్ముళ్లతో సారసాస్య జ్ఞాతివైరం పెట్టుకుంది. శుక్లపక్ష విన్యాసాలతో విక్రమార్కుడు సహజవైరం పెట్టుకున్నాడు.

పాణినే పణంగా ఒడ్డిన పణ్యాంగన పైయెత్తు కాయత్తపడింది. పరంతపుడి పరా-

---

టిప్పణి:

1 డెల్ఫిక్ ఆరెకిల్ — టూకీగా చెప్పాలంటే, ఇదమిత్థమని ఖచ్చితంగా విషయాన్ని తెలియజెయ్యని గ్రీకు సోది

2 ఫ్యాన్‌క్కెటో — చదరంయొక్క వికర్ణాలల (long diagonals) ను శకటు కాపలాలో ఉంచే ఎత్తు. (B-N2)

3 ట్సగ్ ట్స్వాంగ్ — ఏ యెత్తు వేసినా అపాయం తప్పని పరిస్థితి

4. మనదేశపు ఆట ప్రకారం రాజుకి కోట కట్టడమనే (castling) ఎత్తు లేదు దానికి బదులు ఒక గుర్రపుగంతు వెయ్యవచ్చును.

5. ఆన్‌ప్రీజ్ — మరణావస్థ (చదరంగం పరిభాషలో)

క్రమాన్ని భంగపరచాలన్న పట్టుదలతో సర్వతోభద్రబంధంవంటి చదరాన్ని సింహావలోకనం చేసింది. గడికొక అక్షరంగా గణించి అప్పకవినుంచి ఎరువు తెచ్చుకున్న వృత్తంలో ప్రథమ పాదాన్ని విలోమ (Palindromic) ప్రార్థనగా పఠించింది: "వందే సదా దాస దేవం." సంతుష్టుడయిన ఛాందసుడు రెట్టించి పంక్తికి పదహారక్షరాల "అశ్వగతి"ని స్ఫురణకు తెచ్చేడు.

ఆ వృత్తపు సూచన నంగీకరించిన అతివ పంచధారా ప్రావీణ్యాన్ని ప్రదర్శించే పారశీకాన్ని పురికొల్పింది. కైజామోరనెత్తిన తేజీ విద్యావిహీనుడిలాగ, ద్వాపర ధర్మంలాగ పాదద్వయం మీద గెంతింది. అధర్మాభ్యుత్థానంలాగ మరో ఖురయుగాన్ని పైకెత్తి, గాలిలో కయ్యానికి రెండు కాళ్లు దువ్వింది.

అశ్వప్లుతం, స్త్రీచిత్తం కూడా అవగాహన కాలేదారాతివీరుడికి, సంగతిసందర్భాలు కనుక్కోమని శకటును సిద్ధం చేసేడు. పగవారి ప్రక్కలో బల్లెం వంటి ఫ్యాజ్గ్కెటో (fianchetto) లో నిలబడిన అరదం ఆకేకరంగా ఆనుపానులు చూసుకుంది.

ఉచ్చైశ్రవం పట్టపగ్గాలూ పగవారూ లేని మేఘాశ్వంలాగ ముందు కురికింది, తత్తడి హుళక్కి అన్న తప్పటూహాలు చెల్లాచెదరయ్యేటట్లు హేషించింది. రథరక్షణలోనున్న రహదారికి రెండుగళ్ళవతల వాలింది. దూరానికి దుమికిన అశ్వాన్నడ్డుకోవడానికి అరద మశక్తమయింది. బండి ఓడవలసిన పరిస్థితి వచ్చింది. రేఫం వంటి శకటం ఊచ్చవడిపోయింది.

అపారితమయిన వారువంతో వారణం వప్రక్రీడలకు తలపడింది. కరి నరికట్టడానికి శివదీ...ఈ...ఘాపరూ రాలయిన సాని సామజ - దానవ - భేదక దండకాన్ని పఠించగా చతురోపాయం తోచింది.

ఆదిలో ఏకవచన ప్రయోగాని కలవాటుపడ్డ భటులిద్దరు "తానుత్తమ" అన్నంత పురుషకారంతో అహమహమిక కనుపరచేరు హయరక్షణకి, భార్గవుణ్ణంకానికి పిలిచేటంత బింకంతో ఒక బంటు పారశీకానికి బాసటగా నడిచేడు. నడచెనా గంధ గండక బంధ ధుర్య వేదండ తుండను నటుండుండు మనెను. దానితో ద్విపానికి ధైర్యం విలోల మయింది. ప్రస్థానత్రయ భాష్యకారుణ్ణి సైతం భయపెట్టగలిగిన గజం పలాయనం తథ్యమనుకుంది...

సమరం తుముల మయింది. పణ్యాంగన పణంగా ఒడ్డిన.దే పైచేయిగా ఆట నడిపించింది. తెలుపుల ధాకకి తాళలేని కలువలు కనలిపోయాయి. ఝాన్సీవంటి జాణముందు తన టాఠాలు సాగక ఖిన్నుడయ్యాడు పరాతప్తుడు. "టఠకారా ఖేదకారా (డశ్శుభో ధస్త్వకాంతి కృత్)"... వగైరా అక్షరగుణ విచక్షణ చేసిన వివేకులకావిషయం ఆశ్చర్యాన్ని కలిగించలేదు.

వేశ్య సామాన్య కాదని స్వీయానుభవం మీద తెలిసివచ్చేటప్పటికే ఖిన్నుడికి కాలం మించిపోయింది.

(Zugzwang) ట్సగ్ ట్స్వాంగ్

* * *

వీగిపోయే బలాలని వేళాకోళం చెయ్యడం ద్వారా మోమోటమిని మరుగు

పరచుకో దలచేడు మగరాయడు. పుణ్యాహ వాచనం కలశను మూసిపట్టుకో బోయేటట్లు చెయ్యి ముందుకు చాపి, మరణావస్థలోనున్న మంత్రిని ముట్టుకున్నాడు. బహుపరాక్ పలికే గొంతుతో ఘోషించినట్లన్నాడు:

"రాణీసాహెబా*"

ఉలిక్కిపడ్డ కలికి కళ్ళెత్తి చూసింది.

"ద్వాత్రింశన్మంత్రులూ సాలభంజికా సంఖ్యకి సరిపోయేరు. అదనపు అమాత్యులను జేర్చి ఆ సామ్యాన్నంతం చెయ్యడమెందు కనిపించింది."

చదరంగం గళ్ళలో కదనం చేసే సాలభంజికలకే కాక సింహాసనం మెట్లమీద కథలు చెప్పే సాలభంజికలకి కూడా సంఖ్యా సామ్యం వర్తించిం దనుకుందామె

"అయితే?"

"కాకపోతే, 'కరణేషు మంత్రీ' అని రాణిని వజీరుగానే వ్యవహరించి ఉండేవాణ్ణి."—ఆమె నుదుటి మడతలు చదును చేసి, బొమముడి విప్పేటట్లు విశదీకరించేడు.

"మంత్రి" అని మనమూ, "రాణి" అని విదేశీయులూ వాడే పారిభాషికపదాలకి ఆటలోనే కాకుండా ఆరోక్తి ద్వారా కూడా అభేదాధ్యవసాయం జరిగిందన్న సంగతి గ్రహించి విస్తుపోయింది, వేశ్య.

"వాగ్మివి, పో!" అని మెచ్చుకుంది. కాని వజీరన్నందుకు వేళాకోళం చేసింది.

"రంభ వంటి దానివి జంభాసురారి ప్రయోగాలని పరిహసించవచ్చునా?" అని, అనువదించే డతడు: "...కదలుడు చాటి చెప్పె డెరుగం దెరగంటి వజీర్ల కీ యెడన్ అని పలికి యంతిపురికిం జనె సురపతి."

రన్ ఆన్ వర్స్ (Run on-verse) లాగ నడచిన రెండు వృత్తాల తుదా-మొదళ్లనీ వేరుచేసుకుందామె. కాని పద్యాలే ప్రబంధంలోనివో చప్పున జ్ఞాపకం రాలేదు. కందాన్ని కడదాకా చదివిస్తే, కవిపేరు తలపుకు రాకపోదన్న ఆశతో అడిగింది:

"శేషం—?"

"వెంకటపతి!" — వక్రోక్తిలో సూటిగా సమాధానపరిచే డామె అడగని ప్రశ్నని.

ఆటనే మరపించే మాటసొంపుకు ముగ్ధురాలయింది మగువ. మరులుగొన్న మనసులో మనసిజవికార మంకురించింది.

మానసంలో కూడా.

కొండనంటే కొండకొన నున్న కోనేటిలో గ-గ-న కుసుమాలవంటి రా-జీవములు గగ్గోలుపడ్డాయి. మకరంద మాధుర్యమును గ్రోలు మధుపంబుబోమె నే మదన శరాసన మౌర్వి కావడనికి! అని వాపోయిం దొక వనరుహం. మాయురె భృంగమా! అంది మరొక అరవిందం. వెనుకటి గుణ మేల మాను? నంది వేరొక వారిజం.

గుణం అర్థాంతరాని కనుగుణంగా చంచరీకాలు ఝుంకారానికి బదులు వెనుకటి టంకారం చేసేయి. నీరజనాయకత్వం వదిలి వెనుకటి నారిగా మారేయి.

* పాశ్చాత్యులు చదరంగంలో "మంత్రి"ని "రాణి" అంటారు.

ఎడబాటు కోర్వలేని అబ్జాలాసు గమనంతో అళులను జేరుకున్నాయి. అంబకాలయ్యాయి. విరహానికి గురికావడానికి బదులు విరహిణులను గురికొన్నాయి

కాముడు కటకాముఖ హస్తంతో కమలాలని సంధించేడు.

వేయని బాణాలూ, తీయని బాధలూ వనితను వెతబెట్టేయి. పణంగా ఒడ్డిన పాణి నప్పనంగా అభిముఖుడికిమ్మని ప్రేరేపించేయి ఆట నోడిపోవాలన్న అభిప్రాయం కలిగిం దబలకి.

కాని అభిమానం మనోరథానికి శల్యసారథ్యం చేసింది. క్షణకాలంపాటు స్త్రీబుద్ధి ప్రణయాంతక మయింది. అతని చెక్కిళ్లతో సరసాలాడే చూపులు చదరంమీాదికి దిగజారేయి.

దృష్టి తగిలిన నలుపులు దద్దరిల్లేయి. కోట కట్టుకోలేని రాజు రాహుతుడై గంతువేసేడు. అవాంతరాన్ని తొలగించుకొని ఐరావతం తెరచి రాజంది స్వామిభక్తిని కనుపరచి శకటడ్డుపడింది. కామికాజీ (Kamikaje)* గమనంతో కదలివచ్చిన సామజం బండిని బరిణెలోనికి పంపింది. ఆ సాహసానికాశ్చర్యపడ్డాడు రాజు. గత్యంతరంలేక గజాన్ని సంహరించేడు. పడతి పన్నుగడ ఫలించింది. పగరాజు పరివారానికి దూరమయ్యేడు. రక్షణలేని రంగం మధ్య చిక్కుకున్నాడు. ఒంటరి రాజును వెల్లబలాలు వెన్నంటి తరిమేయి.

కాందిశీకు డయిన కువలయాధిపుడు గడి-గడి గండంగా గడచి ఆరాత్రి రాజు కారవ ఊతిబాధంత ఆసన్నుడై నిలబడ్డాడు. విజయవిలాసం వెల్లివిరిసేటట్లు కలికి ముఖారవింద మల కల్వాలరాయని తోసిరాజనెన్. ఆ తుది సంరంభంతో అతని ఆట కట్టింది.

* * *

పొడుపుకథవంటి సామెత పూర్వార్థం అర్థం విడింది. అభిముఖులాశించిన (కాబోయే కాపురం) పరిణామం ఆరు మూడయింది.

* * *

అమాత్యుడు ఆన్‌ప్రెజ్ (en prise) అయిన క్షణంనుంచీ ఓటమి తప్పదని నిష్కర్షగా తెలుసుకున్న నిర్జితుడు నిశ్చింత నభినయించేడు. ఆట పోయినా, అపహాస్యానికి గురి కాకూడదనుకున్నాడు. ఎత్తుల నవలోడనం చేసుకోగా బండికళ్ళంత లేసి రెండు తప్పులు కళ్ళకికట్టినట్లు కనబడ్డాయి. సంకట పరిస్థితులలో సహాయపడని శకట్ల పొరపాట్లవి. వేశ్య వేళాకోళాలకి పూనుకుంటే, ముందుగా తన బళ్ళ మీాదికే "బళ్లు తోలుతుం"దని గ్రహించి, సమాధానాలకి సిద్ధపడలనుకున్నాడు.

తాను తలచినదే సాసీ తలచింది. బళ్లనిచూసి పకాలున నవ్వింది "రొండుకి రొండే కొండప్పా!" అన్నట్లున్నాయి," అంది. "రాజును రక్షించబోయి శతాంధాః" అన్నట్లు నడిచి చచ్చిన శకటొకటీ, సైంధవాన్ని శిక్షించలేక స్తంభించిపోయిన శకటొకటీ!...

"అచ్చతెన్గు లీరీతిగ," అని హేళనగా కొసిరింది. "పోతే గుడ్డెద్దులాగ పోతుం

---

* కామికాజీ=ప్రభుకార్యార్థమై ఆత్మ వినాశానికి ఉద్యుక్తులయే జపాన్ విమానచోదకులు.

దొంకటీ, పోలేక రాయిలాగ పడుంటుం దొంకటీ!"

"సంస్కృతంబు పచరించినపట్టన," అన్నాడు చిన్నబుచ్చుకోదలచుకోని చతురుడు. "గచ్ఛతీతిగౌః; నగచ్ఛతీతి నగః!"

క్షణక్షణముయిన జవరాలిచిత్తం జల్లుమంది. జిగీష తెచ్చిన అగచాట్లను తలచుకుని తల్లడిల్లింది, మాటసొంపుకు మరులుగొన్న మనసు మళ్లీ మన్మథ బాధ పడింది.

బలంబులు రెండును గెల్వనేర్చునని భ్రమపడ్డ పడతి, పాపం అతడు తనను జయిస్తే, తానతన్ని జయించవచ్చునని ఆశించిన అతివ, పాపం. మోమోటమికోర్వలేక, ఆటగెలిచి తెచ్చుకున్న అపజయాన్ని తలచుకుంటే ఉప్పెనగా దుఃఖం వచ్చింది. సాని సానుభూతికోసం సఖిదగ్గరకు జేరింది.

"తన్నోడి నన్నోడెనే!" అని నిర్జితుణ్ణి నిందించి ఏడ్చింది.

ఆమె కష్టాన్ని తొలగించడానికి చెలికి సామాన్యమయిన ఉపాయంతోచింది. పరాజితుణ్ణిపరిహాసించి, రెచ్చగొట్టి, రెండవ ఆట నాడించాలనుకుంది. మానిని అభిమానాన్ని మాన్పి, ఆమె చాతుర్యానికి తన చేతగానితనాన్ని చేదోడువాదోడు చేసి, ఆట నోడించి అతణ్ణి గెలుచుకునేటట్లు చెయ్యదలచింది. ఆ ఆలోచనతోటే అతడున్నచోటికి సానిని వెంటబెట్టుకుని వచ్చింది.

ఒంటరితనంలో ఊసుపోకకి అతడంగుష్ఠమధ్యమాలమధ్య బళ్ళని తలక్రిందుగా పట్టుకొని బొంగరాలు తిప్పుకుంటున్నాడు.

కాలి అలికిడికి కళ్ళెత్తి చూడగా చెయ్యి జారిన శకట్లు చతికిలబడ్డాయి.

కొత్తమనిషిని చూసి చిరునవ్వు నవ్వేడతడు అక్కరకురాని యరదములంటూ బళ్ళని "పరాసికం"గా పరిచయం చేసేడు.

They toil not, nor do they spin — "కాయకష్టము నాస్తి కదురొడక సుస్తీ" అన్నాడదే ధోరణిలో.

పరాజితుడి బడాయిపలుకు పడతికి నచ్చలేదు. "భంగపడ్డ బళ్ళకి "బైబిలు" అనువాదంకూడా ఎందుకూ?"

"బిషప్పులు కనుక."*

హాస్యాన్ని లక్ష్యం చెయ్యక, ఆమె వచ్చినపనికి పునాది వెయ్యడానికి పూనుకుంది. ఆట మళ్లీ ఆడడాని కుసికొల్పేటట్లు ఘాటైన మాటల్ని వాడింది.

"ఆడదాని చేతిలో ఓడిపోయేరు. పేరు పోగొట్టుకొని పైగా పరిహాసాలాడుతున్నారు. మీ ఒంట్లోది నెత్తురా, నీరా?"

చెలి నుడి-కారాల కతడు మండిపడి వెళ్ళిపోతాడేమోనని భయపడింది, సాని. స్వయంగా క్షమాపణలు చెప్పుకోబోయింది.

"నీరు!" అన్నాడంతలోనే, అతడు నిర్లక్ష్యంగా. "జీలంజలం. పేరు పురుషోత్తముడు, పోయిందేమీలేదు."

జవాబుకి సాని గుండె జిల్లుమంది. సఖిమాత్రం చిర్రుమంది.

---

* బిషప్పులు = శకటులు

"చింత చచ్చినా పులుపు చావదుట! పరాజితులయినా బింకపుమాటలు మానక పోవడంలో విశేష మేముందిలెండి!"

"సామెతకయితే అలంకార ప్రాయముగా సరిపోయింది కాని విశేషం నా మాటల కెలా నప్పుతుంది?"

ఆ చమత్కారాన్నర్థం చేసుకుందుకు చంద్రాలోకాన్ని చింతన చేసుకుంటూ చెలి కిమ్మనకుండ ఊరుకుంది. అవకాశాన్ని వినియోగించుకుని అత డెదురుదాడి సాగించేడు.

"నువ్వనువదించిన విశేషాలంకారం కంటే నీస్వంతమయిన నిరుక్తికమే అందంగా ఉంది."

"నిరుక్తికం?" అందామె, పుస్తకం పునశ్చరణ నాపుచేసి. "అటువంటి అలంకార మెప్పుడూ వినలేదు."

"వినబడక పోవడమే దాని విశిష్టత. విభూషణం మాన..."

"సిగ్గు! సిగ్గు!"

"అదుంటే అలంకారా లక్కర్లేదు."

"భర్తృహరి సుభాషితాలు బాగా వంటబట్టేయే?"

"భర్తృహరికి," అని తప్పుదిద్దే డతడు, చిలిపిగా. "జీర్ణమంగే సుభాషితం అన్నవి శతకకర్త మాటలు."

పెడర్థాలూ, పిడివాదాలూ-అనుకుని విసుగెత్తిన చెలి విరమించింది.

సఖి చాలించిన సంభాషణను సాని సాగించదలచింది, మాటల్ని మాటుపెట్టి మరికొంత కాల మత ణ్ణాపుచేస్తే, ఈ లోపులో వ్రతంచెడకుండ వరుణ్ణి దక్కించుకునే ఉపాయం తోచకపోదన్న ఆశతో. ఏ విషయా న్నెత్తుకోవాలో తోచక నలువంకలా కలయజూసేటప్పటికి నఖక్షతంవంటి నెలవంక చీకట్లని చీల్చుకుంటూ వచ్చి కనబడింది.

చదరంగంలో పావొడ్డి పందెం గెలిచింది గనుక గోష్ఠి నుపక్రమించడనికీ అదే ఎత్తు వాడదలచి, చంద్రుణ్ణి చూపుతూ అంది:

"అంకం కేపి శశంకి రే!"

"చీకటి తప్పని!"—హాజరు జవాబులాగ అన్నా డతడు.

నిజానికి నూలుపోగంత చంద్రుడిలో నిశి పీతాంధ తమస్సు కనబడడం లేదు. అయితే, దోషాకరుడి తప్పును తలపుకు తెచ్చే ప్రస్తావన నెందుకు తెచ్చిందని అతని కనుమానం కలిగింది. ఆలోచించగా అర్థమయింది, అది తన నిర్గమనాన్ని నిరోధించడానికి నెపం మాత్రమేనని.

ఆకూతజ్ఞత అతనిలో అంతకుముందు కలగని ఆశల కంకురార్పణ చేసింది. పందెం పట్టదలకేగాని ప్రణయానికి తావు లేదనుకున్న పడతి మనస్సులో పంచశరుడి ప్రభావం పడిందని గ్రహించేడు. చదరంగానికి లోబడని సానిని చమత్కారాలతో జయించదలచేడు.

నీ నవురు నన్నము గానూ! అన్న నీలాసుందరి శాపం తగిలి చిక్కిన చంద్రుని వైపు చెయ్యి జాపేడు. వృద్ధి క్షయాల విషయాన్నెత్తుకోకుండా, తిట్టి దీవించినట్లన్నాడు:

"దిన దిన ఖండం, దీర్ఘాయుష్షు."

"జైవాతృకుణ్ణి వర్ణించడంలో చూపిన చతురత శుక్లపక్షాన్నోడించడంలో కనుపరిస్తే జితాస్మి అని ఉందునుగదా!"—పొరపాటున ప్రకాశమయిన స్వగతంలా అనుకుందామె.

సాని తనమీాదికి తోసిన తప్పు నాడు దైవజ్ఞులమీాదికి తోసి తప్పించుకోదలచేడు.

"సిద్ధాంతులు పూర్వపక్షమే బలీయమని గణించి పడేసేరు. పరం నాపరమయింది. నా చతురంగ బలం పంచాంగ బలంముందు పనికిరాలేదు. ఆనందాది యోగాలు కూడి రాకపోతే ఆట నెగ్గడ మెవరితరం?"

అతని అపహాస్యాల కక్కసు తీర్చుకునేటందు కదను దొరికిందని సంతోషించిన చెలి ఔచితిని లెక్క చేయకుండ గీర్వాణంగా అంది:

"నిందతి కంచుక మేవ ప్రాయశ్శుష్క..."

"పూర్ణ యౌవనయితే ప్రియంవదనో అనసూయనో నిందిస్తుంది," అన్నా డతడు, ఆమె నోరర్థోక్తిలో మూత పడేటట్లు. "ఉన్నదానికీ లేనిదానికీ ఇతరుల్ని నిందించడం అతివలకే సహజం."

మాటపడ్డ వేశ్య మగవారి తప్పులెన్ని తీరాలనుకుంది. పాతకోపాలని జ్ఞాపకంచేసుకుని పరుషంగా అంది:

"అతివల నయినవాటితోటీ కాని వాటితోటీ పోల్చడం పురుషుల ప్రకృతయినట్లు!"

"త్రిమూర్తులనీ కాదని తన్వంగిని స్తుతించిన అమరుణ్ణి తలుచుకుంటే అలా అని ఉండవు," అన్నా డతడు తాపీగా.

"ఆయనకేం, కవి రమకః," అని ఒప్పుకుందామె. "అలం కమల జన్మనా అని ప్రారంభించిన పెద్దమనిషి మాట?"

"అతని అపరాధ మేమిటి?"

"కృతాద్యవస్థలో కైచాపులు చేసి కడకి కలికిని క్రరతోటీ, కాలకూటంతోటీ పోల్చడమే.

"ఉత్పల కాంగ యష్టిం...ట! 'సమత' అన్న నోటితో యోషని యష్టిగా ఎట్లా వర్ణించగలిగేషో!-అవమానోత్తర పద కర్మదారువు సమాసం అనాలి కాబోలు దీనిని!"

ఆమె కోపానికి నవ్వుకున్నా డతడు.

"కొమ్మా అంటే చెడని కోమలత్వానికి యష్టీ అంటే నష్టమొస్తుందా?" అన్నా డనునయించేటట్లు. "పైగా ఎంతటి చిగురుబోడి కయినా మ్రాన్పడిపోవడం మన్మథావస్థ."

చక్షుఃప్రీతిగా చూసిం దామె, సమర్థనకు సంతసించి.

"అది సరే," అంది, కొంత శాంతించి. "కాని, అద్యాపి నో జ్ఝతి హరః కిల కాలకూటం అనడం సరసమయిన సామ్యమేనా? ధ్వని అవాచ్యం! అలంకారం విషమ-యం..."

ఆమె ఆఖరిమాటతో ఉపాఖ్యానం జ్ఞాపకం వచ్చిందతనికి. సమర్థించడానికి

వీలులేని పరిస్థితిలో చమత్కారమే శరణను కున్నాడు.

“కాలకూటాన్ని కళ్యాణప్రదంగా మార్చుకున్న కలికి కథ తలుచుకుని గర్వ పడడానికి బదులు సామ్యాలకి జడుసు కోవడం జాణతనమేనా?” అన్నాడు. “విషం మింగవలసిన గళానికి విషయానందాన్ని లభింపజేసిన వనితవృత్తాంతం తెలియదూ?”

చంద్రహాసుడి పెళ్ళిధర్మమా అని చాయుంగల విన్నపాలై తెరిపిని పడ్డాడు.

ఆమె హృదయంలో కవిమీది కోపం మాటకారిమీది మోహానికి తావిచ్చి తప్పుకుంది. ఉండబట్టలేని మనస్సు ఊరుకో నియ్యలేదు, నీళ్లు నమిలితే లాభంలేవనుకుని సుదతి నోరువిప్పి అంది:

“మాటలతో మనస్సు నపహరించేవు చేతలతో చేతిని స్వీకరిస్తే చౌర్యం నబబుగా ఉండిపోను. పందెం గెలిచి పణంగా ఒడ్డిన పాణిని గ్రహించి పాలించడానికి బదులు బాధలకి గురిచేసేవు.”

“మాటలకి మనసిచ్చేవా? నా చేతగాని తనానికి చేతిని స్వీకరించు. చౌర్యమేమీలేదుగాని నబబు మాత్రం పూతుంది.”

“మరి నా పరతుమాట?” అందామె ఆశల్ని చెదిరిపోకుండా అదిమిపట్టుకుని. “పందెం గెలిచిన వానికే పాణి నిస్తా నని వ్రతం పట్టేను.”

“పరతు లిద్దరికీ సమానమే. చేతుల నొడ్డుకున్నాము. జయించేవు. గెలుచుకున్న కరాన్ని గ్రహించడమే నీకు కర్తవ్యం!”

తీరని ధర్మసందేహంనుంచి తెరిపిన పడిందామె. పైచేయిగా ఆటను నడిపించిన చేతిని పందెంగా గెలుచుకున్న చేతితో పెన వేసింది. అభిముఖు లైదు పది చేసుకున్నారు.

కసిగా ఆరంభమయిన ద్యూతం కరిఖిలంగా ఆఖరయింది.

* * *

ఆరెకిల్ వంటి సామెత ఉత్తరార్థానికి (పప్పుముద్ద భోజనానికి) అర్థం పెళ్ళని తెలిసింది.

ఆరు మూడు కాపురం పప్పుముద్ద భోజనం అన్న ఉపశ్రుతి చూళికా ప్రాయంగా సూచించిన ఫలితం కాయూ పండూ కూడా నని చివరకి బోధపడింది.

* * *

సఖి చదరంగం బల్లమీద సాల భంజికలని పక్కకి పదహారేసి చొప్పున పేర్చి, పాణిగ్రహణం చూడడానికి పేరంటాళ్లని పిలుచుకువచ్చింది. బొమ్మల నోము చేసుకుని భర్తను సంపాదించుకున్న అతివ నంతా అభినందించేరు. గెలుపోటములు లేని కరిఖిలం కథను విని నోములోని భాగాన్ని నెమరుకు తెచ్చుకున్నారు.

“చూస్తీ చూస్కీ; ఏంచూస్కీ; దేవీ దేవరా చూస్తీ; దేవీ దేవరా ఏంచేస్తున్నారు? ముత్యాలూ రత్నాలూ ముందుపోసుకుని జూదమాడుతున్నారు. ఎవ రోడేరు ఎవరు గెలిచేరు? ఇద్దరూ ఏకసమానమే. అందు కెవరు సాక్షి? నందిసాక్షి నాగుబాము సాక్షి ఎడనున్న ఎల్లమ్మసాక్షి కడనున్న గంగమ్మ సాక్షి...”